# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 26 । ఆగస్టు । 2023





**రక్తదానంతో ప్రాణదానం**

ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. 8లో



**ఆర్తులకు ఆపన్నహస్తం**

గిరిజనులకు సీఆర్‌పీఎఫ్ పోలీసులు బాసటగా నిలుస్తున్నారు. సేవా కార్యక్రమాలతో స్నేహ పూరిత వాతావరణం నెలకొల్పుతున్నారు. 8లో



**సీతాకోక చిలుక కనువిందు**

సాక్షి, పాడేరు: పెదబయలు మండలం ఇంజరిలో పెద్ద పరిమాణంలో ఉన్న సీతాకోకచిలుక కనువిందు చేసింది.

## న్యూస్‌రీల్

### నేటి నుంచి రాష్ట్రస్థాయి సాంస్కృతిక సంబరాలు

**అరకులోయ రూరల్:** మండలంలో యండపల్లివలస ఏకలవ్య పాఠశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి ఏకలవ్య పాఠశాలల సాంస్కృతి సంబరాలు ఈ నెల 26 నుంచి 28 తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు క్రీడా పాఠశాల, ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు మూర్తి, సన్యాసినాయుడు శుక్రవారం తెలిపారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

### నవోదయ దరఖాస్తు గడువు పెంపు

**ఎటపాక:** స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 31వరకు పొడిగించినట్టు విద్యాలయం ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం శుక్రవారం తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఆరవ తరగతిలో ప్రవేశానికి వివిధ కేటగిరీల్లో అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

### మెగా జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**అరకులోయ రూరల్:** స్థానిక ప్రభుత్వ ఐటీఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. ఇంటర్వ్యూలకు 570 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. 10 కంపెనీల్లో 570 పోస్టుల భర్తీకి నిర్వహించిన ఇంటర్వ్యూలకు 382 మంది నిరుద్యోగులు హాజరైనట్టు చెప్పారు. వీరిలో 132 మందిని ఎంపిక చేశామని తెలిపారు. మిగిలిన ఖాళీలను మరో మేళాలో భర్తీ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కల్పన అధికారులు సంగీత, సతీష్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సీడాప్ కో–ఆర్డినేటర్ శ్యామ్ పాల్గొన్నారు.

### 9న జాతీయ లోక్ అదాలత్

- అరకులోయ కోర్టు జడ్జి శివకిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి శివకిరణ్

**అరకులోయ రూరల్:** వచ్చేనెల 9న అరకులోయ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎం.శివకిరణ్ తెలిపారు. కోర్టు ప్రాంగణంలో స్థానిక సీఐ రుద్ర శేఖర్, అరకులోయ, అనంతగిరి, డుంబ్రిగుడ మండలాల ఎస్‌ఐలు, కోర్టు న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోక్ అదాలత్‌లో మూడు మండలాల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పెండింగ్ కేసులు పరిష్కారం జరిగేటట్టు అందరూ కృషి చేయాలన్నారు. విస్తృతంగా ప్రచారం చేసి గ్రామ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రమేష్, ఎస్‌ఐలు సంతోష్, సంతోష్‌కుమార్, ఏఎస్‌ఐ వెంకటరావు, న్యాయవాదులు మురళీమోహన్, ప్రభాకర్, సింహాచలం, రత్నంరాజు, రాంబాబు, ప్రేమ పాల్గొన్నారు.

### కూరగాయల వ్యాన్ బోల్తా



ప్రమాదానికి గురైన వ్యాన్

**అనంతగిరి:** మండలంలోని తైడ సమీపంలో కూరగాయల లోడుతో వెళుతున్న వ్యాన్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. అరకులోయ వారపుసంత నుంచి శుక్రవారం కూరగాయలను బొలేరో వ్యాన్‌లో శ్రీకాకుళం తరలిస్తుండగా ఘాట్‌రోడ్డులో అదుపుతప్పి రక్షణగోడను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలోడ్రైవర్, మరోవ్యక్తి గాయపడ్డారు. కూరగాయల బస్తాలన్నీ లోయలో పడిపోయాయి. క్షతగాత్రులను ప్రైవేటు వాహనంలోని ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. వీరు శ్రీకాకుళానికి చెందిన వారుగా స్థానికులు చెబుతున్నారు.

# మురిపించిన మిరియం.. విరగ్గాసిన కాఫీ

- ముందస్తుగానే కాపు
- సిరులు కురిపించనున్న పంటలు
- 2.20 లక్షల ఎకరాల్లో కాఫీ తోటలు
- అంతరపంటగా 80వేల ఎకరాల్లో మిరియాల పాదులు



మోదాపల్లి ప్రాంతంలో విరగ్గాసిన కాఫీ పంట



మినుములూరు ప్రాంతంలో మిరియాల గింజలు

**సాక్షి, పాడేరు:** ఈ ఏడాది వాతావరణం కలిసిరావడంతో కాఫీ తోటలు, అంతరపంటగా వేసిన మిరియాల పాదులు విరగ్గాశాయి. ఏప్రిల్ నెల నుంచే విస్తారంగా వర్షాలు కురవడంతో ముందస్తుగానే పువ్వులు పూసి, జూన్ నెలాఖరు నాటికే కాఫీ తోటలు విరగ్గాశాయి. సెప్టెంబర్ మొదటి వారానికి కాయలు కాస్త పండ్ల దశకు చేరుకుంటాయని కేంద్ర కాఫీ బోర్డు అధికారులు తెలిపారు. కాఫీ తోటల్లో అంతర పంటగా గిరిజన రైతులు సాగు చేస్తున్న మిరియాల పాదులకు పూత ముందుగానే వచ్చింది. ఇప్పుడు లేత గింజలతో మిరియాల పాదులు కళకళాడుతున్నాయి. సాధారణంగా సెప్టెంబర్ నెలాఖరు, అక్టోబర్‌లో లేత మిరియాల గింజలు ఏర్పడతాయి. అయితే ఈఏడాది ముందస్తుగానే గింజలు రావడంతో అధికారులు, రైతులు ఆశ్చర్యపోతున్నారు.

**1.50 లక్షల ఎకరాల్లో కాఫీ ఫలసాయం**

పాడేరు డివిజన్‌లోని 11మండలాల్లో గిరిజనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో ఐటీడీఏ ద్వారా 2.20 లక్షల ఎకరాల్లో కాఫీ సాగు చేస్తున్నారు. వీటిలో 1.50 లక్షల ఎకరాల్లో తోటలకు ఫలసాయం వస్తుంది. గత ఏడాది కూడా కాఫీపంట ఆశాజనకంగా ఉండడంతో 75వేల మెట్రిక్ టన్నుల కాఫీపండ్ల దిగుబడి వచ్చింది. వీటి ద్వారా 16వేల మెట్రిక్ టన్నుల పాచ్‌మెంట్, క్లీన్ కాఫీ గింజలను గిరిజన రైతులు ఉత్పత్తి చేశారు. గిరిజన సహకార సంస్థ రికార్డు ధరతో కాఫీ గింజలను కొనుగోలు చేసింది. ఎకరానికి రూ.50వేల వరకు ఆదాయం లభించింది. ఈ ఏడాది కాపు మరింత ఎక్కువగా రావడంతో 18వేల మెట్రిక్ టన్నుల కాఫీ గింజల దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

**80 వేల ఎకరాల్లో మిరియాల పాదులు**

కాఫీతోటల్లో అంతరపంటగా గిరిజన రైతులు మిరియాల పంటను సాగు చేస్తున్నారు. 80వేల ఎకరాల కాఫీతోటల్లో నీడనిచ్చే సిల్వర్‌ఓక్ వృక్షాలకు మిరియాల పాదులు ఉన్నాయి. ఎకరానికి 100 వరకు మిరియాల పాదులు ఉంటాయి. ఎకరానికి 100 కిలోల వరకు ఎండు మిరియాల దిగుబడి అవుతాయి. ఈ ఏడాది మిరియాల అమ్మకాల ద్వారా ఎకరానికి రూ.45వేల నుంచి రూ.50వేల వరకు ఆదాయం పొందారు.

**దిగుబడులు పెరుగుతాయి**



కాఫీతోటలు ముందస్తుగానే విరగ్గాశాయి. ఎక్కడ చూసిన కాఫీ మొక్కలు అధిక కాపుతో కళకళాడుతున్నాయి. మిరియాల పాదులకు కూడా ఎన్నడూ లేని విధంగా ముందస్తుగానే గింజ ఏర్పడడం ఆశ్చర్యంగా ఉంది. దీంతో అధిక దిగుబడులు రానున్నాయి. కాఫీతోటలు, మిరియాల పాదులకు చేపట్టే సస్యరక్షణ చర్యలపై గిరిజన రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి, నాణ్యమైన కాఫీ, మిరియాల గింజల ఉత్పత్తులకు చర్యలు తీసుకుంటున్నాం.

– అశోక్, ఐటీడీఏ కాఫీ ఏడీ,పాడేరు

# ఎండీయూల ద్వారా అంగన్‌వాడీలకు సరకుల పంపిణీ

**కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశాలు**



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

**సాక్షి,పాడేరు:** జిల్లా వ్యాప్తంగా అందుబాటులో ఉన్న ఎండీయూ(మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్)ల ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యావసర సరకులను గడువులోగా పంపిణీ చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం తన కార్యాలయం నుంచి జిల్లాలోని ఐటీడీఏ పీవోలు,రెవెన్యూ,ఐసీడీఎస్ అధికారులతో పలు అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ సరకుల ఓపెనింగ్ బ్యాలెన్సులు సక్రమంగా ఉండాలని, డీలర్లు సరకుల పంపిణీలో జాప్యం చేస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. మండల స్థాయిలో సీడీపీవోలు,సూపర్‌వైజర్లు, డీలర్లు,ఎండీయూలతో తహసీల్దార్లు సమావేశాలు నిర్వహించి అంగన్‌వాడీలకు సరకుల పంపిణీకి తగిన ఆదేశాలు ఇవ్వాలని సూచించారు.

**పక్కాగా ఓటర్ల సర్వే**

జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌ల పరిధిలో పక్కాగా ఇంటింటా ఓటర్ల సర్వే చేపట్టాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫారం 6,7,8ల సేకరణ సక్రమంగా చేయాలన్నారు. వీఆర్వోలు తప్పనిసరిగా ఇంటింటా ఓటర్ల సర్వేలో పాల్గొనాలని, సంబంధిత వీఆర్వోల హాజరును తనకు తహసీల్దార్‌లు నివేదించాలన్నారు. ఎసైన్డ్ భూముల సేకరణ, వివరాల నమోదుపై తహసీల్దార్‌లు దృష్టిపెట్టాలని ఆదేశించారు.అర్హత కలిగిన రైతులకు పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసాలను అమలుజేయాలన్నారు.అటవీ హక్కుపత్రాలు పొందిన రైతులు,వారి భూముల వివరాలను గిరిభూమి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు.భూముల రీసర్వే,మ్యుటేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, రంపచోడవరం,పాడేరు ఐటీడీఏల పీవోలు సూరజ్ గనోరే, వి.అభిషేక్,డీఆర్వో అంబేడ్కర్, జిల్లా వ్యవసాయాధికారి నందు, సర్వేశాఖ ఏడీ మోహనరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి చిన్నికృష్ణ పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



ఉత్పత్తులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

**రంపచోడవరం:** రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేసుకోవడం ద్వారా రైతులు వ్యవసాయ ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు మార్కెట్ చేసుకోవచ్చని అనకాపల్లి డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి అన్నారు. రంపచోడవరం మండలంలో శుక్రవారం వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో గ్రామీణ వికాస కేంద్రం, వై.ఎస్.ఆర్.క్రాంతి పథం ద్వారా నిర్వహిస్తున్న వివిధ జీవనోపాదుల యూనిట్లలను సందర్శించారు. కోడి పిల్లల పెంపకం యూనిట్లు రైతులకు అతి తక్కువ ధరకు అందించనున్నట్టు తెలిపారు. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాల సూచించారు. సువర్ణవాడలో కోడి పిల్లలు, మేత ,ఇతర పరికరాలను రైతులకు అందించినట్టు తెలిపారు.

# ‘స్పందన’ అర్జీలకు సత్వర పరిష్కారం

**కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశం**



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ ,ఐటీడీఏ పీవో, డీఆర్వో

**సాక్షి, పాడేరు:** స్పందనకు వచ్చే అర్జీదారుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశమందిరంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 92 అర్జీలను కలెక్టర్ సుమిత్ కుమార్, జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్వో అంబేడ్కర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని తెలిపారు. కొన్ని వినతులపై అందుబాటులో ఉన్న అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.

- సాగులో ఉన్న పోడు భూములకు అటవీ హక్కుల చట్టం కింద భూమి హక్కులు కల్పించి, పట్టాలు మంజూరు చేయాలని హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ కరకపుట్టు గ్రామస్తులు అప్పారావు, ఈశ్వరరావు కోరారు.
- హుకుంపేట మండలం ములియాపుట్టులో పాఠశాల భవనాలకు మరమ్మతులు చేయాలని, ప్రహరీ నిర్మించాలని సర్పంచ్ ఎస్.చంటమ్మ కోరారు.
- భాషా వలంటీర్ ఉద్యోగం కోసం అనంతగిరి మండలం వాలాసీ గ్రామస్తుడు భూర్జ విజయ్‌కుమార్ అర్జీ అందజేశారు.
- చింతపల్లి మండలం బలపం పంచాయతీ కుడుముల గ్రామానికి అంగన్‌వాడీ భవనం మంజూరు చేయాలని ఉప సర్పంచ్ పి.కామరాజు వినతిపత్రం అందజేశారు.
- పాడేరు మండలం వంజంగి నుంచి బొర్రమామిడి గ్రామానికి తారురోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ వంతాల బొంజుబాబు కలెక్టర్‌కు విన్నవించారు.
- పాడేరు మండలం దబ్బాపుట్టు గ్రామానికి తాగునీటి సదుపాయం కల్పించాలని గ్రామస్తులు ఎం.కొండబాబు, రాంబాబు విజ్ఞప్తి చేశారు.
- జి.కె.వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ చింతగుప్ప గ్రామానికి మంజూరు చేసిన గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేయాలని వి.రామచంద్ర కోరారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు,పలు ఇంజనీరింగ్‌శాఖల ఈఈలు డి.వి.ఆర్.ఎం.రాజు, కె.వేణుగోపాల్, కొండయ్యపడాల్, లావణ్యకుమార్, డీపీవో కొండలరావు పాల్గొన్నారు.

# భార్యను కాపాడి భర్త దుర్మరణం

**చెరుకుంపాలెం సెంటర్‌లో దుర్ఘటన**



ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రఘునాథరావు

**రాజవొమ్మంగి:** వ్యాన్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువును పసిగట్టిన ఓ భర్త తన భార్యను కాపాడి, ఆమె కళ్లెదుటే దుర్మరణం చెందాడు. మండలంలోని చెరకుంపాలెం సెంటర్‌లో శుక్రవారం ఈ దుర్ఘటన జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గంగవరం మండలం పిడతమామిడి గ్రామానికి చెందిన సచివాలయ ఉద్యోగి కె.మణికుమార్ (31) తన భార్య పోలోజు కుమారిని బస్సు ఎక్కించేందుకు చెరకుంపాలెం సెంటర్‌లో వేచి ఉన్నాడు. అడ్డతీగల వైపు నుంచి జడ్డంగివైపు వేగంగా ఖాళీ పీపాలతో వెళుతున్న బొలేరో వ్యాన్ మణికుమార్‌ను ఢీ కొట్టి రోడ్డు పక్కనే గల ఓ దుకాణంలోకి దూసుకుపోయింది. వ్యాన్ మణికుమార్‌ను కొంత దూరం ఈడ్చుకుని పోవడంతో శరీరం ఛిద్రం అయింది. ప్రమాదాన్ని గ్రహించిన మణికుమార్ తనతో పాటే నిలుచుని ఉన్న భార్యను దూరంగా నెట్టివేయడంతో ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడిందని స్థానికులు తెలిపారు. భార్యను కాపాడిన మణికుమార్ మరణించడం స్థానికులను కంటనీరు పెట్టించింది. వీరికి వివాహం జరిగి ఏడాది అయింది. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని జడ్డంగి ఎస్‌ఐ రఘునాథరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య పోలోజు కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కుమారి మండలంలోని సింగంపల్లి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచర్ (సీఆర్టీ)గా పనిచేస్తున్నారు.



మణికుమార్ (ఫైల్)

# గెస్ట్ ఫ్యాకల్టీలకు దరఖాస్తుల ఆహ్వానం

**కంచరపాలెం(విశాఖ):** విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో గెస్ట్‌ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపవతి ఓ ప్రకటనలో కోరారు. జే ఎల్–ఇంగ్లిష్, టీజీటీ–ఫిజికల్ సైన్స్, జేఎల్–జువాలజీ, టీజీటీ–బయలాజికల్ సైన్స్, పీజీటీ–సోషల్ సబ్జెక్టు పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు తమ ఒరిజినల్, నకలు, ధ్రువీకరణపత్రాలతో 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు కొమ్మాదిలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ గురుకులం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో నిర్వహించే డెమోకి హాజ రు కావాలని సూచించారు. సంబంధిత సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ కలిగి ఉండాలి. టెట్ అర్హత సాధించిన వారికి ప్రాధాన్యమిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 0891–2799641లో సంప్రదించవచ్చు.

# వరాల తల్లికి ఘనంగా వ్రత పూజలు

**మోదమ్మ ఆలయంలో సామూహికంగా వరలక్ష్మీ వ్రతం**



ఉత్సవ విగ్రహాన్ని తీసుకొస్తున్న సింహాచలంనాయుడు



అలంకరించిన వరలక్ష్మీ తల్లి విగ్రహం



మోదకొండమ్మ తల్లి ఇత్తడి ఘటాల వద్ద మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతం జరిపిస్తున్న ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం

**సాక్షి,పాడేరు:** జిల్లాలో శుక్రవారం వరలక్ష్మీ వ్రత పూజలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రతి ఇంటా ప్రత్యేక పూజలు జరిపారు. పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. గ్రామదేవతల ఆలయాల్లోనూ శ్రావణమాసం రెండవ శుక్రవారం పూజలు జరిగాయి. పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి శుక్రవారం ఉదయం నుంచి భక్తులు తాకిడి ప్రారంభమైంది. సాయంత్రం మహిళలు భారీగా ఆలయానికి చేరుకుని క్యూలైన్‌లో గంటల తరబడి నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. మోదమ్మ ఉత్సవ విగ్రహం, ఇత్తడి ఘటాలను కల్యాణమండపంలోకి తోడ్కొని వచ్చి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలను వైభవంగా జరిపించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడంతో పాటు భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.

# జిల్లాలో జోరుగా వర్షాలు



పాడేరులో కురుస్తున్న వర్షం

**సాక్షి, పాడేరు:** జిల్లా వ్యాప్తంగా రోజూ జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల తరువాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. పాడేరులో సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో భారీగా వర్షం పడింది.

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వ్యవసాయానికి మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయాధికారి నందు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 180.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.రాజవొమ్మంగిలో 74.4 మిల్లీమీటర్లు, చింతూరులో 15.4, జీకే వీధిలో 14.2,మారేడుమిల్లిలో 13.6, హుకుంపేటలో 11.6, పాడేరులో 10.2, కొయ్యూరులో 10.2, దేవీపట్నంలో 4.8, పెదబయలులో 4.4, వై.రామవరంలో 3.6, గంగవరంలో 3.6, జి.మాడుగులలో 3.6, ముంచంగిపుట్టులో 3.2, డుంబ్రిగుడలో 2.2, అనంతగిరిలో 2.4, అరకులోయలో 2, చింతపల్లిలో ఒక మిల్లీమీటరు వర్షపాతం నమోదైంది.

### కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత



విద్యార్థినులను అంబులెన్స్‌లో మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలిస్తున్న సిబ్బంది

**మారేడుమిల్లి:** స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.నాగమణి, బి.కల్యాణ అనే విద్యార్థినులు శుక్రవారం ఉదయం కళ్లుతిరిగి పడిపోయారు. పాఠశాల సిబ్బంది వారిని 108 మారేడుమిల్లి పీహెచ్‌సీకి తరలించగా, అక్కడ నుంచి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లారు.


# బిడ్డ మరణం తట్టుకోలేక ...

- పురుగు మందు తాగి తల్లి ఆత్మహత్య
- కొన్నేళ్ల క్రితం భర్త.. ఇప్పుడు బిడ్డ మృతి
- కరకపల్లిలో విషాదం



మరణించడానికి ముందు చింతపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బింగు

**చింతపల్లి:** కొన్నేళ్ల కిందట భర్త..ఇప్పుడు బిడ్డ మరణించడంతో ఆమె తట్టుకోలేకపోయింది. అప్పటి వరకూ ముద్దు ముద్దుగా మాటలు చెబుతూ తన కళ్లెదుటే ఆడుతూ తిరిగిన తన బిడ్డ సాయంత్రం పడుకుని శాశ్వత నిద్రలోకి జారుకోవడంతో ఆ తల్లి హృదయం కకావికలమైంది. తనకు ఈ జీవితమే వద్దనుకుంది. పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. చింతపల్లి మండలం కరకపల్లిలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. కరకపల్లికి చెందిన కొర్రా కామేశ్వరరావుకు అదే గ్రామానికి చెందిన బింగు(20)కు ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్న వీరికి మూడేళ్ల క్రితం బాబు పుట్టాడు. బాబుకు మోజో అని పేరు పెట్టి అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. అంతలోనే వీరిపై విధి పగబట్టింది. అనారోగ్యంతో కామేశ్వరరావు మృతి చెందాడు. అప్పటి నుంచి కూలి పనులు చేస్తూ బిడ్డే ప్రాణంగా బింగు జీవనం సాగిస్తోంది. ఆమె పనులకు వెళ్లినప్పుడు మోజోను సమీప బంధువులకు అప్పగించి వెళ్లేది. గురువారం ఆమె ఇంటి వద్దే ఉండి పనులు చేసుకుంది. అప్పటి వరకూ ఆడుతూ కళ్ల ముందు తిరిగిన బిడ్డ సాయంత్రం నిద్రపోయాడు. అంతే మరి లేవలేదు. శాశ్వత నిద్రలోకి జారుకోవడంతో ఆ తల్లి తీవ్రంగా తల్లడిల్లిపోయింది. నాన్నా లేవరా... బువ్వ తినరా అని ఎంత పిలిచినా పలకక పోవడంతో కన్నీరు మున్నీరుగా విలపించింది. దీంతో చుట్టుపక్కలవారు వచ్చి ఆమెను ఓదార్చారు. బిడ్డ మరణం తట్టుకోలేని ఆమె పురుగు మందు తాగింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను శుక్రవారం ఉదయం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ ప్రథమ చికిత్స అనంతరం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కొడుకు మరణం తట్టుకోలేక తల్లి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు తీవ్రంగా రోదించారు. స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు.



మృతి చెందిన మోజో(ఫైల్)

# ఆర్తులకు ఆపన్నహస్తం

- గిరిజనుల సేవల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు
- సివిక్ యాక్షన్ కార్యక్రమాలతో మరింత చేరువ
- దుస్తులు, రగ్గులు, నిత్యావసరాలు అందజేత



సీఆర్‌పీఎఫ్ బలగాలు అందజేసిన గొడుగులతో గిరిజనులు, చిత్రంలో అధికారులు

**ముంచంగిపుట్టు:** గిరిజన ప్రాంతాల్లో నిరుపేద గిరిజనుల బాసటగా నిలుస్తున్నారు. నిత్యం ఎన్నో సేవల కార్యక్రమాలు నిర్వహిస్తూ మేము ఉన్నది మీ కోసమే అంటూ ధైర్యాన్ని ఇస్తున్నారు. గిరిజనులతో మమేకం అవుతూ పోలీసులు అంటే భయాన్ని పోగొడుతూ స్నేహపూరిత వాతావరణాన్ని నెలకొల్పుతున్నారు. గిరిజన ప్రాంతంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పోలీసు బలగాలు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీఆర్‌పీఎఫ్ బలగాలతో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేశారు అల్లూరి సీతారామరాజు జిల్లాలో 22 మండలాల్లో 8 సీఆర్‌పీఎఫ్ బలగాల క్యాంపులు ఉన్నాయి.సుమారు 600 మంది వివిధ స్థాయిల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులుగా విధులు నిర్వహిస్తున్నారు.

### గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

గిరిజన ప్రాంతాల్లో రక్షణగా విధులు నిర్వహిస్తునే సేవ కార్యక్రమాలతో చేరువవుతున్నారు. సివిక్ యాక్షన్ కార్యక్రమాలు నిరుపేద గిరిజన గ్రామాల్లో నిర్వహిస్తూ వారికి అవసరమైన సామగ్రిలు, దుస్తులు, రగ్గులు, లాంతర్లు, బిందెలు, సోలార్ లైట్లు, వంట సామగ్రి, గొడుగులతో పాటు గిరిజన యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లు, పుస్తకాలు అందిస్తున్నారు. సివిక్ యాక్షన్ కార్యక్రమం ద్వారా గిరిజన గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి పనులపై విస్తృతంగా గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని పోలీసులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

### 598 గ్రామాల్లో సేవలు

అల్లూరి జిల్లాలో 22 మండలాల్లో 8 సీఆర్‌పీఎఫ్ క్యాంపులు ఉన్నాయి.గత మూడు సంవత్సరాల్లో 598 గ్రామాల్లో సివిక్ యాక్షన్ కార్యక్రమాలను పోలీసులు నిర్వహించారు. మండలాల్లో పేద గిరిజన గ్రామాలను గుర్తించి, వారి ఆర్థిక పరిస్థితులు, అవసరాలను ముందుగానే తెలుసుకుంటున్నారు. అందుకు అనుగుణంగా ఆయా గ్రామస్తులకు అవసరమైన సామగ్రిని అందజేస్తున్నారు.

### వేలాది పేద గిరిజనులకు వితరణ

గత మూడేళ్లలో సీఆర్‌పీఎఫ్ పోలీసులు పేద గిరిజనులకు అందించిన సామగ్రి వివరాలిలా ఉన్నాయి.. బిందెలు–10,251 మందికి, వంట పాత్రలు 4,388 కుటుంబాలకు, చీరలు–32,544 మందికి, రగ్గులు–12,654 మందికి, లాంతర్లు–18,201 మందికి, గొడుగులు–11,096 మందికి, దోమతెరలు–13,973 మందికి, సోలార్ లైట్లు–14,098 మందికి, వాలీబాల్ కిట్లు–9,122 గ్రామాలకు, క్రికెట్ కిట్లు–5,393 గ్రామాలకు, ఫుట్‌బాల్–2,301 గ్రామాలకు, క్యారంబోర్డులు –3,007 గ్రామాలకు వీటితో అనేక క్రీడా సామిగ్రిలను కూడా పంపిణీ చేశారు. గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ పోలీసులు అందిస్తున్న సేవలపై గిరిజనులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### పోలీసులపై మరింత గౌరవం

సీఆర్‌పీఎఫ్ పోలీసులు గ్రామాలకు వచ్చి సివిక్ యాక్షన్ కార్యక్రమం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పాటు పేద కుటుంబాలకు ఉచితంగా దుస్తులు, వంట పాత్రలు, సోలార్ లైట్లు అందిస్తున్నారు. వారి సేవ కార్యక్రమాల వల్ల పేద గిరిజనులకు అధికంగా లబ్ధి చేకూరుతుంది. ఒకప్పుడు పోలీసులంటే మా ప్రాంతంలో భయం ఉండేది. ఇప్పుడు భయంపోయి వారి పట్ల గౌరవం పెరుగుతుంది.

– ఎస్.కృష్ణ, కొత్తసుజనకోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

### గిరిజనుల అభివృద్ధికి ప్రాధాన్యం

గిరిజన గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ ద్వారా సివిక్ యాక్షన్ కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, పోలీసులు శాఖ ద్వారా కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పిస్తున్నాం. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో దోమతెరలు, దుస్తులు, సోలార్ లైట్లు, యువతకు క్రీడా సామగ్రిలను ఉచితంగా అందిస్తున్నాం. గిరిజనులు పోలీసులకు మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొల్పుతున్నాం.ఆ లక్ష్యంతోనే పని చేస్తున్నాం.

– శ్రీరాజేష్ పాండే, కమాండెంట్, సీఆర్‌పీఎఫ్–198 బెటాలియన్



## సీఎం జగన్‌కు ఘన స్వాగతం

**చినమేడపల్లి గ్రామంలో సీఎంను కలిసిన జిల్లా నేతలు**



కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న అరకు ఎంపీ మాధవి, కేంద్ర మంత్రికి , సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి, జీసీసీ చైర్‌పర్సన్ శోభ స్వాతిరాణి

**సాక్షి, విశాఖపట్నం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి విశాఖ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు నియోజకవర్గంలోని మెంటాడ మండలం చిన్నమేడపల్లిలో సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ శంకుస్థాపనకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం 10.10 గంటలకు సీఎం విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కలెక్టర్ మల్లికార్జున, సీపీ త్రివిక్రమ్ వర్మ, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, జేసీ విశ్వనాథన్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పుష్పగుచ్ఛం అందజేసి సీఎం వైఎస్ జగన్‌కు స్వాగతం పలికారు. అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ఎంపీ మాధవి, ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులాపల్లి ధనలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జీసీసీ చైర్‌పర్సన్ శోభస్వామితి రాణి తదితరులు చిన్నమేడపల్లిలో సీఎం వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.మన్యం జిల్లా పర్యటన ముగించుకుని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్లో తిరిగి మధ్యాహ్నం 1.45 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు.అనంతరం తాడేపల్లికి తిరుగుపయనమయ్యారు.

## విద్యుత్ షాక్‌తో మూడు దుక్కిటెద్దులు మృతి



తాల్లబుతోటలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎద్దులను పరిశీలిస్తున్న సర్పంచ్ రమేష్

**ముంచంగిపుట్టు:** మండలంలోని సుజనకోట పంచాయతీ తాల్లబుతోట కాలనీలో విద్యుత్ షాక్‌కు గురై మూడు దుక్కిటెద్దులు మృతి చెందాయి. గ్రామంలో శుక్రవారం ఉదయం విద్యుత్ స్తంభంపై అకస్మాత్తుగా మంటలు చెలరేగి, వైర్లు తెగి పశువుల పాకపై పడ్డాయి. షాక్‌కు గురై పాకలో ఉన్న మూడు దుక్కిటేద్దులు అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో మంటలు అదుపులోకి వచ్చాయి. సుమారు రూ.లక్ష విలువైన దుక్కిటెద్దులు మృతిచెందడంతో బాధిత రైతు తమర్బ లక్ష్మణరావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సర్పంచ్ వెంగడ రమేష్ గ్రామానికి వెళ్లి పరిశీలించారు. రైతు లక్ష్మణరావుతో మాట్లాడి ప్రభుత్వం నుంచి ఆదుకునేల చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేసి, సరఫరాను పునరుద్ధరించారు.

## రక్తదానంతో ప్రాణదానం

**కలెక్టర్ సుమిత్ కుమార్**



రక్తదానం చేస్తున్న ఆర్టీసీ,ఐటీడీఏ ఉద్యోగులను అభినందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, అధికారులు

**సాక్షి,పాడేరు:** రక్తదానం ప్రాణదానంతో సమానమని, కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థ స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఆర్టీసీ, ఐటీడీఏలకు చెందిన 16 మంది ఉద్యోగులు రక్తదానానికి ముందుకు రావడంతో వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం చేయడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవన్నారు. ఈ శిబిరంలో 16 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అభిషేక్, జేసీ శివశ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, ఆర్టీసీ డీఎం శ్రీనివాస్,జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ రూపకళ, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు లోహితాస్, సుబ్రహ్మణ్యం, సూర్యారావు, గౌరీశంకర్, జయలక్ష్మి, సంజీవరావు పాల్గొన్నారు.

## పంచాయతీ మరింత అభివృద్ధికి కృషి

**సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పాంగి దుర్జో**



ప్రమాణ స్వీకారం చేస్తున్న సర్పంచ్ పాంగి దుర్జో

**సిలేరు:** సీలేరు మేజర్ పంచాయతీని ప్రభుత్వ పథకాలతో మరింత అభివృద్ధి చేస్తానని, ఉప ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ పాంగి దుర్జో అన్నారు. ఆయన సర్పంచ్‌గా శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాంగి దుర్జో మాట్లాడుతూ తనపై ఉన్న నమ్మకంతో ప్రజలు ఓటు వేసి గెలిపించారని, దీంతో గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు, నవరత్నాలను ప్రజలకు అందజేసి మరింత అభివృద్ధి చేసే విధంగా తోడ్పడతానన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరసింగరావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలన్నీ కూడా పేదలకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఉప ఎన్నికల్లో అన్నిచోట్ల వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ రామకృష్ణ, ఎంపీటీసీ సాంబమూర్తి, వైస్ సర్పంచ్ వలీ ప్రసాద్, నాయకులు శ్రీనివాస్, అప్పారావు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## బడిబయట పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

**రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే**



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న పీవో

**రంపచోడవరం:** రంపచోడవరం. చింతూరు డివిజన్ పరిధిలో బడి బయట పిల్లలను గుర్తించేందుకు ప్రత్యేక సర్వే చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే అధికారులను ఆదేశించారు. పీవో తన చాంబర్‌లో శుక్రవారం గిరిజన సంక్షేమ విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పీవో సూరజ్‌గనోరే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి స్కూల్లో జాయిన్ చేయుటకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీలో ఎంత మంది విద్యార్థులకు జగనన్న విద్య కిట్లు అందజేశారు, దీర్ఘకాలం బడికి రాని పిల్లలు ఎంత మంది ఉన్నారు వంటి వివరాలను తెలుసుకున్నారు.విద్యార్థులకు ఆధార్ కార్డులు సమస్యలు ఉంటే దగ్గర్లో ఉన్న ఆధార్ సెంటర్‌కు తీసుకొని వెళ్లి అప్‌డేట్ చేయించాలన్నారు. వివిధ కారణాల వలన చనిపోయిన విద్యార్థుల పేర్లను చైల్డ్ ఇన్‌ఫో నుంచి తొలగించాలన్నారు. రోజూ ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును వాట్సప్ ద్వారా తెలుస్తోందన్నారు. వివిధ పాఠశాలలకు నాడు నేడు ఫేజ్– 2 ద్వారా మంజూరైన పనుల వివరాలు, బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మంజూరైన పనులకు సంబంధించి, నిధులపై ఆరా తీశారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్ రాజ్. ఏటీడబ్ల్యూవో హాసిని, ఎంఈఓ మల్లేశ్వరరావు, ఎం.వి.వి.సత్యనారాయణ దొర. ఎస్.బాబుదొర, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా దేహదారుఢ్య పరీక్షలు



ఏఆర్ పోలీస్ కార్యాలయం గేట్టు వద్ద క్యూలో ఉన్న ఎస్‌ఐ అభ్యర్థులు

**ఆరిలోవ :** విశాఖ రేంజ్‌లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్ల నియామకాలు కోసం అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. విశాఖ కైలాసగిరి ప్రాంతం ఆర్మడు రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో మొదటి రోజు అన్ని విభాగాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శ్రీకాకుళం, విజయనగరం , విశాఖ జిల్లాల నుంచి అభ్యర్థులు ఉదయం 5 గంటలకే చేరుకొన్నారు. వారంతా ఏఆర్ పోలీస్ కార్యాలయం ప్రధాన ద్వారం వద్దే క్యూలో వేచి ఉన్నారు. ద్వారం వద్ద అధికారులు అభ్యర్థుల హాల్ టిక్కెట్లు పరిశీలించి లోపలకు బ్యాచ్‌లువారిగా పంపించారు. మొదటి రోజు 600 మందికి కాల్ లెటర్లు పంపగా అందరూ హాజరైనట్లు రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ తెలిపారు.

## స్కిల్ హబ్‌లో కొత్త కోర్సులపై ఉచిత శిక్షణ

**తుమ్మపాల:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్‌ల ద్వారా నిరుద్యోగ యువతకు పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి, ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని స్కిల్ హబ్ ఇన్‌చార్జి ఎ.చక్రవర్తి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేబాకలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వచ్చే నెల 4న కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్, డొమెస్టిక్ నాన్ వాయిస్ కోర్సులపై కొత్త బ్యాచ్‌కు ఉచిత శిక్షణ ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ శిక్షణ తరగతులకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమోలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు పాల్గొనవచ్చన్నారు. కేవలం 30 సీట్లు మాత్రమే ఉన్నాయని పేర్కొన్నారు.

ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 28న నేరుగా కళాశాలకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెం.7013342667, 8143229228కు సంప్రదించాలన్నారు.

## లయన్స్‌ను వేటాడిన టైటాన్స్

- నేడు రాయలసీమ కింగ్స్‌తో ఢీ
- గెలిచిన జట్టు ఫైనల్‌లోకి..



గోదావరి బ్యాటర్ల విజయవిహారం

**విశాఖ స్పోర్ట్స్:** ఏపీఎల్ సీజన్–2 ఎలిమినేటర్ మ్యాచ్‌లో లయన్స్‌ను టైటాన్స్ వేటాడేశాయి. లీగ్ పాయింట్ల పట్టికలో రన్‌రైట్‌లో వెనుకబడ్డా... హెడ్ ఆన్స్‌లో విజయంతో ఎలిమినేటర్ మ్యాచ్‌కు అర్హత సాధించిన గోదావరి టైటాన్స్ విజయమే లక్ష్యం అన్నంతగా రెచ్చిపోయింది. ఉత్తరాంధ్ర లయన్స్‌పై ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించి క్వాలిఫైయర్స్ మ్యాచ్‌కు అర్హత సాధించింది.

### మిడిలార్డర్ తడబాటు

టాస్ గెలిచిన గోదావరి టైటాన్స్.. ఉత్తరాంధ్ర లయన్స్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్ గుల్ఫామ్(49) విజయ్ బౌలింగ్‌లో సందీప్‌కు క్యాచ్ ఇచ్చి ఒక్క పరుగు తేడాతో అర్ధసెంచరీని కోల్పోయాడు. మరో ఓపెనర్ కెప్టెన్ భరత్(37) విజయ్ బౌలింగ్‌లోనే మాధవ్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. వీరి జోడి తొలి వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. అయితే శ్యామ్(2), రాహుల్ డకౌట్, తపస్వి(2) విజయ్(8)తో వెనువెంటనే ఔట్ అవ్వడంతో 11 ఓవర్లకు 108 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో శ్రీనివాస్(12), తేజస్వి(12), రఫీ(17) ఇన్నింగ్స్ కాస్త సరిదిద్దే ప్రయత్నం చేసినా మరో బంతి మిగిలి ఉండగానే 153 పరుగులకు ఆలౌటైంది. శశికాంత్, సమన్విత్ మూడేసి వికెట్లు తీయగా విజయ్ రెండు, కమిల్ ఓ వికెట్ పడగొట్టాడు.

### జ్ఞానేశ్వర్ కెప్టెన్ ఇన్నింగ్స్

ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన టైటాన్స్ ఓపెనర్ మునీష్ డకౌట్ గానే అజయ్‌కుమార్ బౌలింగ్‌లో వాసుకి క్యాచ్ ఇచ్చి వెనుతిరిగాడు. ఓపెనర్ కెప్టెన్ జ్ఞానేశ్వర్‌కు హేమంత్ రెడ్డి తోడై స్కోర్‌ను పరుగులెత్తించారు. రెండో వికెట్‌కు వంద పరుగులను జోడించారు. 124 పరుగుల వద్ద హేమంత్ 71(ఏడు ఫోర్లు, మూడు సిక్సర్లు) పరుగులతో తపస్వి బౌలింగ్‌లో విజయ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అతని స్థానంలో వచ్చిన ధీరజ్ రెండు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదేసి 25 పరుగులకు సరిగ్గా 153 పరుగుల వద్ద ఔటయ్యాడు. తపస్వి ఓవర్‌లో చివరి బంతిని సందీప్ ఎదుర్కొని లాంగాన్ మీదుగా సిక్సర్‌గా తరలించాడు. దీంతో 18 ఓవర్లలో మూడు వికెట్లకు 159 పరుగులు చేసి టైటాన్స్ గెలిచింది. కెప్టెన్ జ్ఞానేశ్వర్ రెండు ఫోర్లు, మూడు సిక్సర్లతో 53 సాధించి అజేయంగా నిలిచాడు. తపస్వి రెండు, అజయ్‌కుమార్ ఓ వికెట్ తీశారు.

### వర్షంతో ఆట రద్దు.. ఫైనల్స్‌కు కోస్టల్ రైడర్స్

సాయంత్రం జరిగిన క్వాలిఫైయింగ్ తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి రాయలసీమ కింగ్స్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో కోస్టల్ రైడర్స్ తొలుత బ్యాటింగ్ చేసింది. ధరణి(41), ప్రణీత్(15) వెనుదిరగ్గా రషీద్ 27, హర్షవర్ధన్ 11 పరుగులతో ఉండగా 10.2 ఓవర్ల వద్ద వర్షం కారణంగా ఆట నిలిచిపోయింది. అప్పటికి రైడర్స్ స్కోర్ రెండు వికెట్లకు 103 పరుగులు. వర్షం తగ్గకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేసి లీగ్‌లో ఆధిక్యంలో ఉన్న రైడర్స్ ఫైనల్స్ అర్హత సాధించినట్లు నిర్వాహకులు ప్రకటించారు. శనివారం రాయలసీమ కింగ్స్, గోదావరి టైటాన్స్ పోటీపడతాయి. గెలిచిన జట్టు రైడర్స్‌తో తుది పోరుకు సిద్ధమవుతుంది.